క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అడ్వకేట్స్ కాలనీ, హంటర్ రోడ్డు, వరంగల్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రైల్వే సంఘ్‌లో వైద్యశిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కాజీపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.కృష్ణమూర్తి, జి.సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.నాగేష్ తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పెన్షనర్స్ కాకుండా అన్ని వర్గాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాకారుల ఫోరం జిల్లా కో కన్వీనర్‌గా కొలిపాక భాస్కర్



మడికొండ: కళాకారుల ఫోరం హనుమకొండ జిల్లా కోకన్వీనర్‌గా కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కొలిపాక భాస్కర్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కళాకారులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వెన్నమల్ల వెంకటేష్, గడ్డం సుధాకర్, పాలేటి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



వరంగల్: వరంగల్ లక్ష్మీపురం గిర్మాజీపేట ఎల్లమ్మ తల్లి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న నెల్లుట్ల భాగ్యలక్ష్మి మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబానికి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.30 వేలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తత్తరి లక్ష్మణ్, సభ్యులు శంకర్, ఉమేష్, రాజు, ఎల్లయ్య, రమేష్, శ్రీకాంత్, నాగరాజు, గణేష్, నెల్లుట్ల బాబురావు, కుమార్, బండారి రమేష్, కుమారస్వామి, వేణు, సలహాదారులు దండు దయాసాగర్, రామ బాబురావు పాల్గొన్నారు.

గంట వ్యవధిలో బ్యాగ్ అప్పగింత



హసన్‌పర్తి: ఆటోలో పోగొట్టుకున్న బ్యాగ్‌ను గంట వ్యవధిలోనే బాధితురాలికి పోలీసులు అప్పగించిన సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన నూనావత్ శారద ఆదివారం భీమారం బస్టాండ్ వద్ద ఆటో ఎక్కి కేయూసీ క్రాస్ వద్ద దిగింది. దిగినప్పుడు ఆమె తన బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. అనంతరం ఈ విషయాన్ని కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమైన పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఏఎస్సై లియాఖత్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, మహిళా కానిస్టేబుళ్లు లహరి, మానస రంగంలోకి దిగారు. గంటలోనే ఆ ఆటోను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగ్‌లో అర్ధ తులం బంగారు రింగు, అర్ధ తులం కమ్మలతో పాటు రూ.800 ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. అనంతరం బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగించారు.

సీఎంఆర్‌లో రైస్ మిల్లర్ల దోపిడీ



ఖిలా వరంగల్: నామమాత్రపు చర్యలతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని, సీఎంఆర్‌లో రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన వ్యవహారంపై సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యాలయంలో హైకోర్టు న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్ కుమార్ అధ్యక్షతన న్యాయ సలహా సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల రైస్ మిల్లుల వ్యవహారం, అధికార యంత్రాంగం తీరుపై ఈనెల 25న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రంగరాజు ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, మృదుల, చిలువేరు ప్రవీణ్‌కుమార్, రాజేష్, భార్గవ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హసన్‌పర్తి: ఒకే వేదికపై జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు



కాజీపేట: సమ్మేళనంలో రైల్వే పాఠశాల పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: నగర వ్యాప్తంగా పలు పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల (1974–75) స్వర్ణోత్సవ సంబురం సంస్కృతీ విహార్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 50ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రాంనర్సింహ చార్యులు మాట్లాడుతూ కష్టసుఖాల్లో ఒకరికొకరు పాలుపంచుకోవాలని సూచించారు. పాఠశాలకు ఆర్వో ప్లాంటు కోసం రూ.3 లక్షలు విరాళం ఇచ్చిన పూర్వ విద్యార్థిని విజయలక్ష్మి, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.2 లక్షలు అందించిన ప్రకాశ్‌ను అభినందించారు. నిర్వహణ కమిటీ సభ్యులు చకిలం రాజేశ్వర్‌రావు, రంగారెడ్డి, వల్లాల రవీందర్, సచ్చిదానందం, మల్లేశం, కొమురయ్య, రాజేంద్రం, కిషన్‌రెడ్డి, డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

ఆత్మీయత పంచుకున్న పూర్వ విద్యార్థులు

కాజీపేట: కాజీపేట దక్షిణ మధ్య రైల్వే తెలుగు మాధ్యమ పాఠశాల విద్యార్థులు ఐశ్వర్య కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. 1998 – 99వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రెండున్నర దశాబ్దాల కాలం నాటి పాఠశాల గుర్తులను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలు, ఉపాధి, ఉద్యోగ వివరాలను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. ఒకరి కష్టాలను మరొకరు పంచుకునేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తీర్మానించారు. అనంతరం నాటి ప్రధానోపాధ్యాయుడు టి.కుటుంబ రావుతో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు.

మామునూరు విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మామునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్: మామునూరు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 1978 – 79లో ఏడో తరగతి, 1981 – 82లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మామునూరు శివారులోని వీఎస్పీ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. నాటి గురువులు దిడ్డి లక్ష్మీనారాయణ, చీకటి సమ్మయ్య, వీరనారాయణ, భద్రయ్య బాబురావు, దామోదర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డీఎస్పీ మన్నె భిక్షపతి, మన్నె రవీందర్, కల్వకోట్ల కుమారస్వామి, ఊరుగొండ జితేందర్, సాంబారి, సురేందర్, పుష్ప, సుజాత, సరస్వతి, ఉష, కళావతి, రమాదేవి పాల్గొన్నారు.

'తోటబడి' విద్యార్థినుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థినులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ (తోటబడి) హైస్కూల్‌లో 1994–95 పదో తరగతి విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్ననాటి స్నేహితురాళ్లు ఒకచోట చేరుకుని అప్పటి జ్ఞాపకాలు గుర్తుచేశారు. ఈ సందర్భంగా కుటుంబ ఆర్థిక స్థితిగతులను పరస్పరం పంచుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో సంధ్య, అరుణ, సరిత, రమణి, అనిత, కళ్యాణి, అరుంధతి, అరుణరాణి, శ్రీలత పాల్గొన్నారు.

డాక్టర్ కావలెను!

- మూడు నెలలుగా వైద్యుడి పోస్టు ఖాళీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు
- పెద్దమ్మగడ్డ ఆరోగ్య కేంద్రం దుస్థితి



పెద్దమ్మగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ సీటు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధి పెద్దమ్మగడ్డలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్యూటీ డాక్టర్ (మెడికల్ ఆఫీసర్) లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ రోజూ సుమారు 50 మంది ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. వైద్య పరీక్షలు చేసి తగు మందులు ఇవ్వాల్సిన వైద్యుడు లేకపోవడంతో చేసేదేమీలేక ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్.. మూడు నెలల క్రితం వెళ్లిపోగా అప్పటి నుంచి ఆ సీటు ఖాళీగానే ఉంటోంది. రెండు నెలల క్రితం పెద్దమ్మగడ్డ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య.. రెగ్యులర్ డాక్టర్‌ను నియమిస్తానని చెప్పారు. ఇప్పటి వరకూ నియమించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి రోజు వచ్చే రోగులకు సిబ్బందే మందులు ఇచ్చి పంపిస్తున్నారు.

అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా ఈవీ శ్రీనివాస్‌రావు



శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న బాధ్యులు

రామన్నపేట: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా ఈవీ.శ్రీనివాస్ రావు నియామకమైనట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు టీఎస్.స్వామి తెలిపారు. ఈమేరకు కళాశాల ఆవరణలో సంఘం ప్రధాన కార్యదర్శి పడిశాల ఆనంద్‌కుమార్ అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. కన్వీనర్‌గా ఈవీ.శ్రీనివాస్‌రావుతో పాటు 18 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. అలాగే, ఈనెల 23న జరగనున్న జనరల్ బాడీ సమావేశంలో పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోనున్నట్లు స్వామి తెలిపారు. అప్పటివరకు పూర్వ విద్యార్థులందరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలని, వివిధ పదవులకు ఆసక్తి గలవారు తమ పేర్లను అడ్‌హాక్ కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం నూతన కన్వీనర్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌రావును సంఘం బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్లయ్య, మధుసూదన్ రావు, శంకర్, మేకల అక్షయ్‌కుమార్, మురళీధర్, భిక్షపతి, మహేందర్, కుమార్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, వసంత్‌కుమార్, అజయ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకూ రాష్ట్రంలో ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ అన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్స్, ఇతర ఉద్యోగ నియామకాల ఫలితాలు విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను మంద కుమార్ మాదిగ ప్రారంభించి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని, అవసరమైతే ఇది వరకు జరిగిన నియామకాల ఫలితాల్లో వర్గీకరణ అమలు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పి ఇప్పుడు వర్గీకరణ అమలు చేయకుండా ఫలితాల విడుదల చేయడమేంటని ప్రశ్నించారు. దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన కేయూ 'అకుట్' బాధ్యులు




ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న అకుట్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ

కేయూ క్యాంపస్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) నూతన అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుల పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు కృషి చేయాలని వారు కోరారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



కేక్ కట్‌చేస్తున్న అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు వనజా రెడ్డి, సభ్యులు

హన్మకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర తిరుపతి రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ గోపాల్‌పూర్‌లో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు విగ్రి వనజ, మాజీ అధ్యక్షురాలు పత్తి పద్మ కేక్ కట్‌చేశారు. అనంతరం ఎస్.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మహిళలను గౌరవిస్తూ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. కార్యక్రమంలో రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉప్పుల తిరుపతి రెడ్డి, సభ్యులు ప్రసాద్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ఉమ, ఉజ్వల, రజనీ, ఇందిరా, అనిత, సునీత, రజిత, శోభ, విజయలక్ష్మి, మమత, శ్రీలత, అమల పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌కు రాష్ట్రపతి అవార్డు



మాట్లాడుతున్న రామకృష్ణ

వరంగల్: సామాజిక, సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసపత్రం, రూ.లక్ష నగదు అందుకున్న ఏకైక సంస్థ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అని ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ గుండా ప్రకాశ్‌రావు, మల్యాల వీరమల్లయ్య అన్నారు. స్టేషన్‌రోడ్డులోని ఒక ప్రైవేట్ హోటల్‌లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వరంగల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 2వేల క్లబ్బులు ఉన్నాయని, ఒక ఆర్యవైశ్యులకే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా తోనుపునూరి వీరన్న, ప్రధాన కార్యదర్శిగా గన్ను సంపత్‌కుమార్, కోశాధికారిగా ఉప్పుల వెంకటేశ్వర్లుతో ప్రమాణ స్వీకారం చేయించారు. దేవన్నపేటలోని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థుల కోసం వైస్ ప్రిన్సిపాల్ పద్మావతికి రిఫ్రిజిరేటర్, 15మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ వేమిశెట్టి కిశోర్‌కుమార్, మంచాల విజయ్‌కుమార్, నూతన్‌కుమార్, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి



మడికొండ: కాజీపేట మండలం మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో చుట్టుపక్కల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో అక్కడి నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని కోరారు. రాంపూర్ గ్రామంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు డంపింగ్ యార్డు పొగతో అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. సమస్యను పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తక్కళ్లపల్లి రాంగోపాల్‌రావు, మునిగాల కరుణాకర్, రాంపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల అభిప్రాయాలను గౌరవించాలి



మహిళను సన్మానిస్తున్న సంఘం నాయకులు

వరంగల్: మహిళలను సన్మానించడం కాదని, వారి అభిప్రాయాలను గౌరవించడం, హక్కులను గుర్తించడం ముఖ్యమని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కాశిబుగ్గ యూనిట్ అధ్యక్షుడు తుమ్మ వీరయ్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వరంగల్ సరస్వతి విద్యానికేతన్ స్కూల్‌లో మహిళలను ఆదివారం సన్మానించారు. ఈనెల 20వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని, లేకుంటే మార్చి నెల పెన్షన్ నిలిపి వేయనున్నట్లు తెలిపారు. అనంతరం లైఫ్ సర్టిఫికెట్, ఇన్‌కం ట్యాక్స్ విషయాలపై పెన్షనర్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వీరాస్వామి, రామమనోహర్, రాజయ్య, నాయకులు సుధీర్ బాబు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిన పద్మశాలీలు




మహాసభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కాశిబుగ్గ పద్మశాలి కులస్తులు

వరంగల్: హైదరాబాద్ నాంపల్లిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన అఖిల భారత పద్మశాలి 17వ మహాసభకు కాశిబుగ్గ పద్మశాలి కులస్తులు తరలివెళ్లారు. వరంగల్ అఖిల భారత పద్మశాలి పట్టణ గౌరవ అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్, నాయకులు గోరంట్ల రాజు, వేముల నాగరాజు, వెలిశాల బాబు, డాక్టర్ మామిడి ఈశ్వరయ్య, గుర్రపు సత్యనారాయణ, అల్లి అజయ్‌బాబు, ఆకినె వెంకటేశ్వర్లు, సామల వెంకటస్వామి, బొద్దుల కుమార్, ములుక సురేష్, క్యాతం రంజిత్, మార్త ఆంజనేయులు, తుమ్మ జన్నయ్య, కుసుమ సారంగపాణి, రంగు శ్రీధర్, గడ్డం రమేష్, దూడం అనిల్, కోట సతీష్, కోమాకుల నాగరాజు, చిలగాని రమేష్, జోగు సాంబయ్య, కోట భాస్కర్, బొప్పరాతి నగేష్, కోట కనకారావు, బొప్పరాతి శ్రవణ్, గుత్తికొండ రవి, వడ్డేపల్లి శ్రీనివాస్, బింగి మహేష్, తదితరులు హైదరాబాద్ తరలివెళ్లారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

వరంగల్: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ అన్నారు. పోచమ్మమైదాన్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింలందరు కలిసి పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఈనెల చివరి వారంలో రంజాన్, ఉగాది పండుగలు ఉన్నాయన్నారు. సమావేశంలో ముస్లిం మత పెద్దలు, ఇన్‌స్పెక్టర్లు షకుర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురిలో శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

కాజీపేట: చైతన్యపురి కాలనీలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ వేడుకలను వేద పండితులు కనులపండువగా నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వధూవరుల పక్షాన నిలిచి నూతన వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి వేద పండితులకు అందజేశారు. పండితుల పర్యవేక్షణలో శ్రీమాన్ నారాయణుడి వివాహ తంతును పూజారులు జరిపించారు. పాలకమండలి సభ్యులు కన్యదానం చేయించగా, ఆలయ ఆవరణలో ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాదిమంది భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని వివాహ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్, ఐలోని వెంకట మల్లారెడ్డి, తిరునగిరి దిలీప్ కుమార్, శనిగరపు సుజాత, పెద్ది అశోక్ కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాజీపేట: రైల్వే ఎలక్ట్రికల్ లోకోషెడ్ సమీపంలో ఓ గుర్తు తెలియని మధ్య వయస్కుడి మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం ఆదివారం ఎలక్ట్రికల్ షెడ్‌కు వచ్చిన కార్మికులు ఆ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 40 – 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు సీఐ తెలిపారు. వివరాలకు 87126 85122, 87126 84495 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాగునీరందించి రైతులను ఆదుకోవాలి

ఎల్కతుర్తి: దేవాదుల నార్త్ కెనాల్ నీరందక ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో ఎండిపోతున్న మొక్కజొన్న, వరి పంటలను సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ మెట్ట ప్రాంతానికి అందాల్సిన దేవాదుల నీరు అందకపోవడంతో రబీలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దేవాదుల నీరు వదిలి పెట్టాలని కోరారు.

ఐలోని మల్లన్నకు భక్తుల మొక్కులు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఐనవోలు: వారాంతపు జాతరలో భాగంగా ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం అంతా సందడి నెలకొంది. ఒగ్గు పూజారుల పూజలు, స్వామివారి గర్భాలయంలో అర్చనలు, అభిషేకాలతో సందడిగా మారింది. భక్తులు ఒగ్గు పూజారుల చేత పట్నాలు వేసి పితృదేవతలను పూజించారు. అదే విధంగా రేణుక అమ్మవారికి బోనం ప్రసాదం చేసి సమర్పించారు. కొందరు భక్తులు రథ సేవ చేశారు. మరి కొంత మంది భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదివారం ఆలయం అంతా భక్తుల తాకిడితో ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది.

జనావాసాల్లోని బెల్ట్‌షాపుల వద్ద గొడవలు



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో వీధికో ఓ బెల్ట్‌షాపు ఉంది. ఈక్రమంలో ఎనీ టైమ్ మద్యం అంటూ ప్రచారంలో ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటల పాటు బెల్ట్‌షాపుల వద్ద మందుబాబులు క్యూ కడుతూ ఉంటారు. వారి న్యూసెన్స్ తట్టుకోలేక బెల్ట్‌షాపుల నిర్వాహకులతో స్థానికులు గొడవకు దిగుతున్నారు. ఎస్ఆర్ఆర్ తోటలోని ఆర్యవైశ్య శ్మశాన వాటిక వీధుల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపులను ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీ చేసి కేసులు నమోదు చేయలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. బెల్ట్‌షాపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. ఈమేరకు బెల్ట్‌షాపును మూసివేయాలని ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు.